క్లుప్తంగా

ఎయిర్‌పోర్టులో వాహనాలకు సీరియల్ నంబర్లు

నిఘా నేత్రం విస్తృతం



సీరియల్ నంబర్లు అందుకున్న వాహనదారులతో సీఐ సత్యకిషోర్

మధురపూడి: మండలంలోని మధురపూడి విమానాశ్రయంలో నిఘా చర్యలు విస్తృత మయ్యాయి. ప్రయాణికులను ఎయిర్‌పోర్టు నుంచి తరలించడానికి ఆటోలు, క్యాబ్‌లు న్నాయి. అయితే ప్రయాణికుల తరలింపులో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. దానిలో భాగంగా ఆదివారం ఆటోలు, కార్లకు సీరియల్ నంబర్లు ఇచ్చారు. ఈ సందర్భంగా కోరుకొండ సీఐ సత్యకిషోర్ వాహనదారులతో మాట్లాడుతూ భద్రతాపరమైన చర్యల్లోభాగంగా సీరియల్ నంబర్లు కేటాయిస్తున్నట్టు తెలిపారు. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కల్గించరాదన్నారు. సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. గుర్తుతెలియని, వ్యక్తులు, అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించేవారి వివరాలు పోలీసులకు తెలియజేయాలన్నారు. సీరియల్ నంబర్లుండటంతో వాహనదారుడు, ప్రయాణికులకు ఎటువంటి సమస్యలు ఉత్పన్నమయినా, వాహనం సమాచారాన్ని నిఘానేత్రం పసికడుతుందన్నారు

9న సార్వత్రిక సమ్మె

పెదపూడి: ఈ నెల 9 జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులందరూ జయప్రదం చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షురాలు ఎం.రాజేశ్వరి తెలిపారు. ఆమె పుట్టకొండలో ఆదివారం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల కోసం చేయాల్సిన కర్తవ్యాలు సరిగా నిర్వహించడం లేదన్నారు. కార్మికులందరికీ కనీస వేతనాలు అమలు చేయాలన్నారు. పని గంటలు తగ్గించాలని, నిత్యావసర వస్తువులు ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్క కార్మికుడు స్వచ్ఛందంగా ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆసుపత్రి స్థల దాతకు నివాళులు



బుల్లియ్యరెడ్డి విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న డాక్టర్ రామగురెడ్డి తదితరులు

అనపర్తి : నియోజకవర్గ కేంద్రమైన అనపర్తి ఏరియా ఆసుపత్రి స్థలదాత స్వర్గీయ ద్వారంపూడి బుల్లియ్యరెడ్డి వర్ధంతి సభ ఆదివారం ఆసుపత్రి ఆవరణలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా దాత కుటుంబ సభ్యుడు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తాడి రామగురెడ్డి స్వర్గీయ బుల్లియ్యరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. దాత కుటుంబ సభ్యులు బుల్లియ్యరెడ్డి, వెంకటరెడ్డి, సతీష్‌రెడ్డి, కృష్ణబాబు, కర్రి రుద్దారెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు మేడపాటి సత్యనారాయణరెడ్డి, డాక్టర్ సతీష్ చంద్రారెడ్డి పాల్గొన్నారు.

మెడికల్ షాపుల్లో డ్రగ్స్ అధికారుల తనిఖీలు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఔషధ నియంత్రణాధికారులు ఆదివారం మూడు మందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. మందుల దుకాణాల్లో సిడినాఫిల్ సిట్రేట్ (వయాగ్రా) మందులు విక్రయిస్తున్నారనే సమాచారం అందిన కారణంగా ఈ తనిఖీలు నిర్వహించినట్లు డ్రగ్స్ అధికారులు చెబుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా కొయ్యలగూడెం, బుట్టాయిగూడెంలలో వయాగ్రా దందా అధికంగా నడుస్తోంది. ఆ ప్రాంతాలకు రాజమహేంద్రవరం కేంద్రంగా మందులు సరఫరా అవుతున్నాయని సమాచారం. ఈ నేపథ్యంలో దేవీచౌక్‌లోని అపోలో, బైపాస్‌రోడ్డులోని సంజీవనీ మెడికల్స్, గోరక్షణపేటలోని సత్య మెడికల్స్‌లో తనిఖీలు చేశారు. అయితే ఈ దుకాణాల్లో ఎటువంటి ఆధారాలు లభించలేదు. అపోలో మెడికల్స్‌లో వయాగ్రా మందులు ఉన్నప్పటికీ వాటన్నింటికీ ఆ దుకాణం నిర్వాహకులు డ్రగ్స్ అధికారులకు సంబంధిత బిల్లులు చూపించారు. డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ హరహరితేజ మాట్లాడుతూ దేవీచౌక్ అపోలో మెడికల్‌తో పాటు మరో రెండు దుకాణాల్లో సిడినాఫిల్ సిట్రేట్ (వయాగ్రా) మందులు బిల్లులు లేకుండా అమ్ముతున్నారనే సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామన్నారు. అటువంటి ఆధారాలు కనిపించలేదన్నారు. అపోలో మెడికల్‌లో సరిగా రిజిస్టర్ మెయింటెనన్స్ చేయకపోవడం వంటివి కనిపించాయన్నారు.

డిసెంబర్ 20న గోదావరి టాలెంట్ టెస్ట్

ప్రకాశం నగర్ : గోదావరి టాలెంట్ టెస్ట్ డిసెంబర్ 20న నిర్వహించనున్నట్లు టాలెంట్ టెస్ట్ కన్వీనర్ ఎస్పీ గంగిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నుంచి పదవ తరగతి లోపు విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంలో ఈ పరీక్ష నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిన అడ్మిషన్లు

- చేరికల గురించి పట్టించుకోని అధికారులు
- బదిలీల హడావుడిలో ఉపాధ్యాయులు



ప్రభుత్వ పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

రాజానగరం: ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు తాబేలు నడక చందాన జరుగుతున్నాయి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వేసవి సెలవుల అనంతరం పాఠశాలలను తెరిచే సమయంలో 'తల్లికి వందనం' పథకం ద్వారా విద్యార్థుల తల్లుల బ్యాంకు అకౌంట్లలో రూ.15 వేలు చొప్పున జమ చేసింది. అయితే ఈ ఆర్థిక సాయంతో కొంతమంది పేరెంట్స్ తమ పిల్లలను ప్రభుత్వ బడులలో కాకుండా ఇంగ్లిష్ చదువుల మోజులో ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించే క్రమంలో ప్రభుత్వ బడులలో చేరికలు అధికారులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. గత ప్రభుత్వం అమలు చేసిన ' నాడు - నేడు' పథకంలో అభివృద్ధి చేసిన పాఠశాలల్లో కాస్తో కూస్తో చేరికలు జరుగుతున్నాయిగానీ, ఇతర పాఠశాలల్లో నామమాత్రంగా కూడా ఉండటం లేదనే విమర్శలు వస్తున్నాయి.

కొరవడిన అవగాహన కార్యక్రమాలు

సాధారణంగా వేసవి సెలవుల అనంతరం పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించే విధంగా చైతన్య సదస్సులు, గ్రామసభలు, బడిబాట వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. కానీ ఈ కూటమి ప్రభుత్వం వాటిని వదిలేసి, ఉపాధ్యాయుల బదిలీలకు ప్రాధాన్యమివ్వడంతో పాఠశాలలు తెరిచే సమయంలో న్యూ అడ్మిషన్ల గురించి పట్టించుకునేవారు, ప్రయత్నించే వారు లేకపోవడమే అడ్మిషన్లు మందకొడిగా జరగడానికి ప్రధాన కారణంగా కొంతమంది ఉపాధ్యాయులే చెబుతున్నారు.

మండలం	ప్రాథమిక పాఠశాలలు	నిర్దేశించిన లక్ష్యం	చేరికలు
రాజానగరం	42	422	270
కోరుకొండ	39	338	241
సీతానగరం	43	316	269

'తల్లికి వందనం'తోనే ప్రైవేటులో అడ్మిషన్లు

ప్రభుత్వం అమలు చేసిన 'తల్లికి వందనం' పథకాన్ని ప్రైవేట్ పాఠశాలలు తమకు అనుకూలంగా మలుచుకోవడం కూడా ప్రభుత్వ పాఠశాలలో న్యూ అడ్మిషన్లు చురుగ్గా లేకపోవడానికి మరొక కారణంగా కనిపిస్తుంది. ఈ పథకం ద్వారా తల్లుల బ్యాంకు అకౌంట్లలో రూ.13 వేలు చొప్పున జమ చేశారు. ఆ సొమ్ముతోనే తమ పాఠశాలలో చేర్చుకుంటామని కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు ఆఫర్లు ఇవ్వడంతో కొంతమంది విద్యార్థుల తల్లిదండ్రులు అటు మొగ్గు చూపారు. దీనితో కొన్ని ప్రభుత్వ పాఠశాలలో న్యూ అడ్మిషన్ల మాటెరుగు ఉన్నవాటిని కాపాడుకునేందుకు ఉపాధ్యాయులు నానా తంటాలు పడవలసిన దుస్థితి ఎదురైంది.

సరైన ప్రచారం లేదు

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఏవిధమైన ఆర్థిక భారం లేకుండా ఉచిత విద్యను అందించడమే కాకుండా ఆయా విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంతోపాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫారమ్స్, షూస్, స్కూల్ బ్యాగ్స్ మున్నగు వాటితో కూడిన కిట్స్‌ని కూడా ఉచితంగా అందిస్తున్నారు. ఈ విషయాలపై విస్తృతంగా ప్రచారం జరగవలసిన సమయంలో ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతుండడంతో ప్రచార లోపం ఏర్పడి, అడ్మిషన్లకు గండి కొట్టిందనేది కూడా వాస్తవం.

గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో ఐదు సంవత్సరాలు వయసు పైబడిన పిల్లలు, బడి ఈడు కలిగిన పిల్లలను గుర్తించి మార్చి, ఏప్రిల్, మే నెలలో విద్యాశాఖ ద్వారా ప్రభుత్వానికి నివేదిక వెళ్తుంది. తదనుగుణంగానే విద్యార్థుల సంఖ్యను క్రోడీకరించి, పాఠ్య పుస్తకాలు, విద్యా కిట్స్‌ని సమకూరుస్తుంటారు. వీటి ప్రకారమే మండలాలకు న్యూ అడ్మిషన్లపై నిర్ణీత లక్ష్యాలను కూడా నిర్దేశిస్తుంటారు. ఈసారి ఆయా లక్ష్యాలను కనీసం సగానికి పైగా దాటించాలనే తపనతో ఉపాధ్యాయులు కుస్తీ పడుతున్నారు.

> **చేరికలు బాగానే ఉన్నాయి**
>
> మండలంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల న్యూ అడ్మిషన్లు బాగానే ఉన్నాయి. అక్కడక్కడా కొన్ని సమస్యలున్నా దివాన్‌చెరువు, లాలాచెరువు వంటి ప్రాంతాలలో అడ్మిషన్లు బాగా పెరిగాయి. బడి ఈడు గల పిల్లలు నూరు శాతం పాఠశాలలో చేరాలనేది ప్రధాన లక్ష్యంగా ఉంది. అంగన్‌వాడీ కేంద్రాల నుంచి కూడా విద్యార్థుల చేరికలు జరిగాయి. బదిలీల కారణంగా ఉపాధ్యాయుల కొరత ఏర్పడకుండా అవసరమైన చర్యలు తీసుకున్నాం.
>
> – జ్యోతి ప్రసాద్, ఎంఈవో -2, రాజానగరం

దేవాలయాల్లో తొలి ఏకాదశి సందడి

- శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో భక్తుల రద్దీ
- శ్రీ వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు



శ్రీ వేంకటేశ్వరస్వామి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



జి.మామిడాడ సూర్యదేవాలయంలో తొలి ఏకాదశి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు



సంపరలో ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామివారు



అనపర్తి జనార్దనస్వామి వారు

కోరుకొండ: తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం దేవాలయాల్లో భక్తుల రద్దీ ఏర్పడింది. స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి ఆలయంలో విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో రావడంతో సందడి నెలకొంది. శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి భక్తుల రద్దీ ఏర్పడింది. స్వామివారికి కొండపైన, కింద ప్రత్యేక పూజలు అర్చకస్వాములు నిర్వహించారు. సుదూరప్రాంతాలకు చెందిన భక్తులు కొండపైన కొలువుదీరిన స్వామిని దర్శించుకున్నారు. స్వామివారి దేవాలయంలో భక్తులకు అన్నసమారాధన జరిగింది. ఆయా దేవాలయాల్లో ప్రసాద వితరణ జరిగింది.

పెదపూడి: మండలంలోని గ్రామాల్లో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు, భక్తి శ్రద్ధలతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ సూర్యదేవాలయం, కోదండ రామాలయం, సంపర గ్రామంలోని శ్రీదేవి,భూదేవి సమేత జనార్దనస్వామి, వెంకటేశ్వరస్వామి, పుట్టకొండ గ్రామంలో ప్రాచీన చరిత్ర గల లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయాల్లో అధిక సంఖ్యలో దర్శనాలు చేసుకున్నారు. తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంపర జనార్దనస్వామి ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు మాట్లాడుతూ స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్ర తులసిపూజ అమ్మవారికి అష్టోత్తర కుంకుమ పూజలు నిర్వహించామన్నారు. దక్షిణాయనంలో పంగలు ప్రారంభమవుతాయన్నారు. దక్షిణాయనంలో వచ్చే తొలిపండగా తొలి ఏకాదశి అని వివరించారు. దక్షిణాయనంలో విష్ణుమూర్తి యోగ నిద్రలోకి వెళతారని భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పుట్టకొండలో ఆలయ ఈవో వడ్డాది సత్యనారాయణ భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసి పర్యవేక్షించారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

అనపర్తి : తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని ప్రముఖ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారు జామునుంచి భారీ సంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనపర్తి పాత ఊర్లో కొలువుదీరిన శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి వారి ఆలయంలో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చకులు వాడపల్లి వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. అ మండలంలోని కెనాల్ రోడ్డులోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలోను, సత్తి పోతారెడ్డి తేతలి రామారెడ్డి రామాలయంలోను, పాలమూరు మదన గోపాలస్వామి వారి ఆలయంలోను ప్రత్యేక పూజలు జరిగాయి.

శాకంబరి అవతారంలో దుర్గాదేవి



పెదరాయవరంలో శాకంబరి దేవి అలంకరణలో దుర్గాదేవి

రంగంపేట: మండల పరిధిలోని పెదరాయవరం గ్రామంలో కొలువైవున్న దుర్గాదేవి ఆలయంలో ఆదివారం అమ్మవారిని శాకంబరి దేవిగా అలంకారం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా బాబూ జగ్జీవన్‌రామ్ వర్ధంతి

కోరుకొండ: మండలంలోని పలుగ్రామాల్లో ఆదివారం బాబూ జగజ్జీవన్‌రామ్ వర్ధంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ దళి తుల ఐక్యతకోసం కృషిచేసిన మహనీయుడన్నారు. మదిగల హక్కుల సంరక్షణలో జగ్జీవన్‌రామ్ అమితమైన కృషి సల్పారన్నారు. దోసకాయలపల్లిలో జగ్జీవన్‌రామ్ వర్ధంతి కార్యక్రమం ప్రత్యేకంగా నిర్వహించారు. బచ్చెంపేట, గాడాల, బూరుగుపూడి, మధురపూడి, తదితర గ్రామాల్లో కార్యక్రమాల్లో జరిగాయి. పలివెల ప్రసాదు, వేమగిరి నాగరాజు, తాతపూడి చిట్టిబాబు, నాగం లక్ష్మణ్, రామన్న పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

రంగంపేట: మండల పరిధిలోని వడిశలేరు గ్రామంలో గల అరుంధతీపేటలో సోమవారం ఉదయం రక్తదాన శిబిరం నిర్వహిస్తామని ఎమ్మార్పీఎస్ అనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రవికుమార్ తెలిపారు. ఆదివారం రాత్రి ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మ దినోత్సవం సందర్భంగా ఉచిత కంటి వైద్య శిబిరం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. రాజమహేంద్రవరం ధన్వంతరి బ్లడ్‌బ్యాంక్, అగర్వాల్ కంటి ఆసుపత్రి ద్వారా ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు.

విశ్వశాంతి కోసం దైవ నామస్మరణ



నల్లమిల్లిలో మాట్లాడుతున్న సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

రంగంపేట: విశ్వశాంతి కోసం ప్రతి ఇంటా సామూహిక దైవనామస్మరణ చేయడం అలవాటు చేసుకోవాలని, అందుకోసమే ఏకాహ, సప్తాహ భజనలు చేస్తున్నామని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నల్లమిల్లి గ్రామంలో కోదండ రామాలయంలో సప్తాహ భజన కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. సత్యసాయి శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సత్యసాయి సంస్థలు లేని గ్రామాలలో 108 భజన పాటల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, భక్తులు అనూహ్య రీతిలో పాల్గొని సామూహిక భజన చేయడం అభినందనీయమన్నారు. సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్రను విజయవంతం చేసిన ఈ గ్రామస్తులు వెంటనే సప్తాహ భజనలో సాయి సంస్థలకు 8 గంటల పాటు భజన చేసే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. ఏడు రోజులు సప్తాహ భజనలు విజయవంతం కావాలని దీనికి సత్యసాయి, శ్రీరాముని దివ్య ఆశీస్సులు ఉంటాయని ఆయన ఆకాంక్షించారు. అంతకుముందు భజనల నిర్వాహకులు మామిడాల సూరిబాబు, నళిని దంపతులు కలశ స్థాపన, అఖండ దీపారాధన, సీతారాముల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి సప్తాహ భజనలు ప్రారంభించారు. స్థానిక భజన మండలితో పాటు రాజమహేంద్రవరం, నిడదవోలు భజన బృందాలు సుమారు ఎనిమిది గంటల పాటు చేసిన సత్యసాయి శత అష్టోత్తర భజన పాటలు కార్యక్రమం భక్తుల్ని పారవశుల్ని చేశాయి. ఈ కార్యక్రమంలో జిల్లా ఆధ్యాత్మిక విభాగ సమన్వయకర్త ఎన్వీ సాయిరాం , విద్యా విభాగ సమన్వయకర్తలు శ్రీనివాసరాజు, రత్నశ్రీ, భజన విభాగ సమన్వయకర్త వి.సుభాష్, జోనల్ కన్వీనర్ సీహెచ్ త్రిమూర్తులు, సేవా సమితి కన్వీనర్లు వీర్రాజు, వెంకట అమర్నాథ్, గోవిందరాజులు, వేదాధ్యాయన సమన్వయకర్త గాయత్రి పాల్గొన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా సింగంపల్లి శ్రీకృష్ణ ఆలయంలోను, కోటపాడు శ్రీరాధాకృష్ణాలయంలోనూ ఏకాహ భజనలు నిర్వహించారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు



పందలపాకలో టీకాలు వేస్తున్న డాక్టర్ ప్రణీత్



పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న డాక్టర్ రామచంద్రారెడ్డి

బిక్కవోలు: మండలలోని పందలపాక పశువైద్యశాల వద్ద పెంపుడు కుక్కలకు రేబిస్ టీకాలు వేశారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ డే ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని పెంపుడు కుక్కలకు ఉచితంగా యాంటీ రేబిస్ టీకాలు వేశారు. వాటి యజమానులకు జునోటిక్ వ్యాధి గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశువైద్యులు డాక్టర్ ప్రణీత్ మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులు, వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఇళ్లలో పెంచుకొనే కుక్కలు, పిల్లులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలన్నారు. పెంపుడు జంతువులకు చిన్నపిల్లలు ముద్దులు పెట్టడడం, తాకడం వంటివి చేయకూడదని సూచించారు. బిక్కవోలులో వైద్యులు డాక్టర్ తిరుమలరావు, మెల్లూరు పశువైద్యులు డాక్టర్ అనిత ఆయా గ్రామాల్లో టీకాలు వేశారు.

పెంపుడు జంతువులలో అప్రమత్తంగా ఉండాలి

అనపర్తి : పెంపుడు జంతువుల వల్ల సంక్రమించే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అనపర్తి ప్రాంతీయ పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వై శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం జునోసిస్ డేను అనపర్తి ఏరియా పశువుల ఆసుపత్రి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచిత యాంటీ రేబిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ టీ.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు మండలంలో సుమారు 100 కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేసినట్టు తెలిపారు. అలాగే వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

108 వంటకాలతో శ్రీలంకాలమ్మకు సారె



బొబ్బిల్లంకలో 108 వంటకాల సారెను ఊరేగిస్తున్న భక్తులు



ఉండేశ్వరపురంలో గ్రామ దేవతలకు పసుపు నీళ్ల బోనాలు సమర్పిస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామస్తులు గ్రామదేవత శ్రీలంకాలమ్మ అమ్మవారికి 108 వంటకాలతో సారె అందించారు. ఆదివారం ఆషాఢమాసంలోని తొలి ఏకాదశి సందర్భంగా పలు గ్రామాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలకు చెందిన మహిళలు అమ్మవారికి నూతన చీరలు, రవికల గుడ్డలు, 108 రకాల వంటలను 250 బిందెలలో ఉంచి ఊరేగింపుగా శ్రీలంకాలమ్మ అమ్మవారి ఆలయం వద్దకు చేరుకున్నారు. అమ్మవారికి 108 రకాల వంటల సారెను సమర్పించారు. గరగ నృత్యాలు, తీన్‌మార్, డప్పుల వాయిద్యాలతో ఊరేగింపు సందడిగా సాగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పదకొండు వందల మంది మహిళలకు రవికుల గుడ్డలను అందించారు.

సీతానగరంలో...

మండల కేంద్రమైన సీతానగరంలో ఉమా రామలింగేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న భూదేవి, దేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంను ఆలయ అర్చకులు కొడమంచిలి రాముస్వామి నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు

ఉండేశ్వరపురంలో: మండలంలోని ఉండేశ్వరపురం మండల సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో గ్రామ ధార్మిక సదస్సు ఆధ్వర్యంలో గ్రామదేవతలకు అధిక సంఖ్యలో మహిళలు పసుపు నీళ్ల బోనాలు సమర్పించారు. మండలంలోని పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, సింగవరం, రఘుదేవపురం, రాపాక, ముగ్గళ్ల, కూనవరం, ఇనుగంటివారిపేట, వెదుల్లపల్లి, మునికూడలి, కాటవరం, జాలిమూడి, మిర్తిపాలు తదితర గ్రామాల్లో తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.



ముత్యాలమ్మకు భక్తులు సమర్పించిన ఆషాఢ మాసం సారె



సీతానగరంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు చేస్తున్న భక్తులు

గ్రామ దేవతలకు ఆషాఢం సారె

రాజానగరం: తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం స్థానిక గ్రామ దేవతలైన ముత్యాలమ్మ, నూకాలమ్మ వారికి గ్రామస్తులు ఆషాఢం సారెని ఘనంగా సమర్పించారు. ముత్యాలమ్మ వారిని వివిధ రకాల కూరగాయలతో శాకాంబరిగా అలంకరించారు. అనంతరం పల్లకీలో అమ్మవారిని ఊరేగించారు. ఈ సందర్భంగా స్థానిక బాలల కోలాట ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ప్రతి ఇంటి నుంచి పలురకాల పిండి వంటలు, స్వీట్స్‌తో తయారు చేసిన వంటకాలతో ముత్యాలమ్మకు, నూకాలమ్మకు ఆషాఢ మాసం సారెను సమర్పించారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు



ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం

రాజమహేంద్రవరం సిటీ: ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన ప్రయాణ సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ మునిరత్నం ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఆదివారం రాజమహేంద్రవరం డిపోలో డీపీటీఓ వైఎస్ఎన్ మూర్తితో కలసి మెయిన్ బస్‌స్టేషన్, పల్లెవెలుగు బస్‌స్టేషన్, కార్గో కౌంటర్లను పరిశీలించారు. అధికారులు, ఆఫీస్ సిబ్బంది, ట్రాఫిక్, గ్యారేజీ సిబ్బందితో మీటింగ్ ఏర్పాటు చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు కష్టపడి పనిచేస్తున్నారని వారి ఆరోగ్యాలపై శ్రద్ధ చూపాలన్నారు. మహిళలకు త్వరలో ప్రవేశ పెట్టబోతున్న ఉచిత బస్సు ప్రయాణ పథకం అమలు చేయడానికి బస్సు కండిషన్‌ను మెరుగుపరచాలన్నారు. జీరో యాక్సిడెంట్స్, జీరో బ్రేక్ డౌన్స్ ధ్యేయంగా పనిచేయాలని, ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకూడదని, ఉద్యోగులందరూ ఆ దిశగా పనిచేయాలని అన్నారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ కె.మాధవ్, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.